# దిడెత్ ఆఫ్ ఎ మేనీటర్

అర్థరాత్రి దాటిపోయింది.

ఆకాశం మీద పాలిపోయిన చంద్రవంక కృంగిపోతోంది. పేరుకుపోతున్న తారు ముద్దలా చీకటి దట్టమైంది. చుక్కల వెలుగులో దూరాన కొండలు మసగమసగ్గా కనిపిస్తున్నాయి.

సాయంకాలం నుంచి చెట్టుమీద మంచె కట్టుకొని పులివేట కోసం మాటువేసి కాసు క్కూర్చున్న కనకరాజు, కొడుకు చిట్టిబాబు; తుపాకీలు చేతపుచ్చుకుని చీకట్లో కలిసిపోయిన పొదలవైపు ఏ క్షణాన్నయినా వచ్చే పులికోసం నిరీక్షిస్తున్నారు.

చెట్టుకి ఇరవై గజాల దూరంలో ఎరగా కట్టిన తెల్లటి ఎద్దు అంత చీకట్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. అది నిశ్చింతగా పడుకొని నెమరువేస్తూ చలిగాలి రివ్వున వస్తున్నప్పుడల్లా ఒళ్ళు దులపరించుకుంటూ అట్నుంచి ఇటు ఒత్తిగిల్లడం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. అంతవరకూ దగ్గర్లో ఉన్న చింతచెట్టు మీద దెయ్యాలు మూలిగినట్లు మూలిగినగుడ్లగూబలు మేతకోసంవెతుక్కుంటూ ఎగిరిపోయాయి.

రాత్రి దాటినకొద్దీ చలి ఎక్కువవటం ఆరంభించింది. చలి గాలి కొండల మీది నుంచి రివ్వు రివ్వున వీస్తున్నప్పుడల్లా మాటులో కూర్చున్న చిట్టిబాబు గజగజ వణికిపోతూ ముడుచుకుపోతున్నాడు. పులివేటలో రాటు దేరినకనకరాజు మాత్రం కదలకుండా చలి కొరి కేస్తున్నా; కూర్చున్న దగ్గరనుంచీ ఎలాగున్నాడో అలానే కూర్చొనున్నాడు. చిట్టిబాబు చేస్తున్న చప్పుడికి మనస్సు లో ఉండుండి చిరాకుపడుతున్నాడు.

కనకరాజు రేడియం డైల్ రిస్టువాచీ రెండున్నర సూచిస్తోంది.

మాటులో కూర్చున్న చిట్టిబాబుకి నడుంపీక్కుపోతూ కాళ్ళు తిమ్మిరెక్కిపోతున్నాయ్.

ఉన్నట్లుండి అడవి దద్దరిల్లిపోయేటట్టు దూరంగా కొండలో కణుసు బెదురుగా అరుచుకుంటూ పారిపోతోంది. దాని వెంటనే చుట్టుప్రక్కల కొండల్లోంచి కొండగొర్రెలు ''కార్... కార్.... కార్'' మని విరామం లేకుండా కొండలోయలు గింగుర్లెత్తి పోయినట్లు అరుస్తున్నాయ్. చెట్లమీద నిద్రపోతున్న కోతులు ఈ అరుపులకి కిచకిచమని గోలచేస్తూ చెట్లమీదనుంచి అరుచుకుంటూ దూకుతున్నాయి.

పెద్దపులి బయలుదేరింది- దాని రాక కనిపెట్టిన మిగతా అడవి జంతువులు హడలిపోయి పారిపోతున్నాయి. ఎరగా కట్టిన ఎద్దు ఒక్క ఊపున లేచిపోయి కట్టును విదిలించుకోడానికి గింజులాడిపోతోంది.

కనకరాజు తుపాకి సర్దుకున్నాడు.

అడవిలో చెలరేగిన కలవరానికి బెదిరిపోతున్న చిట్టిబాబుని ''ఫరవాలేదు'' అన్నట్లు చేత్తో నొక్కాడు.

పులి బయలుదేరింది. పాతికమందినిపైగా పొట్టన పెట్టుకున్న మేనీటర్. దీన్ని వేటాడ దామని పట్నం నుంచి వచ్చిన కనకరాజు ట్రావెలర్స్ బంగాళాలో మకాంపెట్టి పది రోజుల్నించి నానా యాతన పడుతున్నాడు. రాత్రనక పగలనక తుపాకీపట్టుకొని అడవిలో తిరుగుతున్నాడు. కొండ

వాగులదగ్గర, అడవిబాటల్లోనూ, కొండగుహల దగ్గరా మార్చి మార్చి ఎరల్ని కట్టి మాటుకట్టి రాత్రిళ్లు కూర్చుంటున్నాడు, అడివంతా దానిఅడుగులు కనిపిస్తున్నాయి. మాటు దగ్గరకి మాత్రం రావటంలేదు, ఎద్దులమీద పడటంలేదు...

కణుసు అరుపునుబట్టి ఎరకట్టిన బాటలోకి పులి రావటానికి మరోపదిహేనునిమిషాలు పట్ట వచ్చునని అంచనావేశాడు కనకరాజు. పొద్దుట ఆ బాటలో ఎక్కడపడితే అక్కడ స్పష్టంగా బాట పొడవునా పులి అడుగులు కనిపించాయి. రోజూ ఆ బాటలోనించే ఏదో ఒక టైంలో వెళుతోంది. ఇప్పుడు వచ్చేటప్పుడు కాకపోయినా తిరిగి వెళ్లేటప్పుడైనా ఆ బాటలోనుంచే వెళ్ళాలి. బాటలో కట్టిన ఎద్దు కనిపించగానే వెంటనే దానిమీదపడి చంపుతుంది- అదే కావాలి. రేపు ఉదయాన్నే మేనీటర్‌ని జీపుమీద వేసుకొని విజయగర్వంతో పట్నానికి తిరుగు ప్రయాణం. పూల మాలలు ఫ్లాష్‌ఫోటోలు – ఓహ్, ఒకటేమిటి- కనకరాజు ఉరఫ్ టైగర్ రాజు అవన్నీ తలచుకొంటూ పులికోసం ఎదురుచూస్తున్నాడు. ఎక్సైట్‌మెంటుతో ఒళ్ళంతా గగుర్పొడుస్తోంది.

చీకటికి అలవాటుపడ్డ కనకరాజు కళ్ళు పులి కళ్ళలా సూక్ష్మాతిసూక్ష్మంగా ఇరుపక్కల అడవిని కలయ చూస్తున్నాయి. నిమిషాలు దొర్లిపోతున్నాయి. ... ప్రతిక్షణం ఎన్నో గంటల్లా అనిపిస్తోంది కనకరాజుకి... మూడుగంటలు కూడా దాటిపోయింది. క్రమేణా అడవిలో తిరిగి నిశ్శబ్దం ఆవరించుకొంటోంది. ఉండుండి అడవి మధ్యలోనుంచి ఎక్కడో చెట్టుమీద చిటారు కొమ్మమీద ఎక్కికాపలా కాస్తున్న కొండముచ్చు '' హూప్! హూప్ ! '' మని అరుస్తూ '' ఆపాయం పొంచి ఉంది; ఇంకా ఆల్ క్లియర్ కాలే''దని తనగుంపుని హెచ్చరిస్తోంది.

క్రమేణా కొండలమీద నుంచి పొగమంచు తెరలు తెరలుగా దిగటం బాగా చీకట్లో కనిపిస్తోంది. రానురాను అడవంతా అలుముకొని కమ్మేస్తుంది.

''గాంర్ర్.... గాంర్ర్ .... గాంర్ర్ ''– పులి దగ్గర్లో అరచింది.

చిట్టిబాబు మాటులో ఉలిక్కిపడ్డాడు.

కనకరాజు రైఫిల్ సేఫ్టీకేచ్ తొలగించి సిద్ధంగా వున్నాడు. వచ్చినప్పటినుంచి మేనీటర్ అరుపు వినడం ఇదే మొదటిసారి. అనుభవం వున్న వేటగాడు కనకరాజుకి అడవిలో నిశ్శబ్దాన్ని చీల్చు కుంటూ అరుస్తున్న పులి అరుపు, తనని సవాల్ చేస్తున్నట్లు అనిపించింది.

చెట్టుక్రింద ఎద్దు, పులి అరిచిన దిక్కుగా తిరిగి చెవులు నిక్కించి బుసలుకొడుతోంది.

..... ....... .......

చిట్టిబాబు ఎగూపిరిలో జాపోస్తున్నాడు.

..... ........ ......

గులకరాళ్ళు దొర్లుతున్నాయి ... బాటలో నుంచి ఏదో జంతువు వస్తున్న చప్పుడు.

..... ...... ......

కనకరాజు ఊపిరి బిగబట్టి రైఫిల్ బుజానికెత్తి ఎద్దువైపు గురిపెట్టి చూస్తున్నాడు... చప్పుడు దగ్గరౌతోంది... మరో క్షణంలో ఎద్దుమీద గభీలున దూకుతుంది పులి..... కనకరాజు శరీరం గగుర్పొడిచి రోమాలు నిక్కబొడుస్తున్నాయి.

..... ..... .....

ఎద్దు మరింత రెస్ట్‌లెస్‌గా గింజుకొంటూ జోరుగా, భారంగా బుసలు కొడుతోంది.

ఒకటి.... రెండు.... ఐదు.... నిముషాలు దొర్లుతున్నాయి.

'జుఁఫ్..... జుఁఫ్.... జుఁఫ్'' – కనకరాజు తుపాకీ గురిచూస్తూనే వింతగా ఆలకిస్తున్నాడు. దగ్గర్లోనే ఉన్న ట్రావెలర్స్ బంగళాలో కుక్క అరవడం మొదలెట్టింది.

.... ..... .....

గలగలమని పరుగెత్తుకుంటూ రెండు ఏదుపందులు ఒంటి మీద ముళ్ళని జుఁఫ్.... జుఁఫ్... మని విప్పుకుంటూ బాట లోంచి వచ్చి ఎద్దుని చూసి కాస్త ఆగి తిరిగి జుఁఫ్ జుఁఫ్ మంటూ పారిపోయాయి. అవి చీకట్లో కనిపించకపోయినా వాటి చప్పుడినిబట్టి అవి ఏదుపందులని తెలుసుకున్న కనకరాజు, డిసెపాయింట్ అయి తుపాకీ దించేసి నుదుటి మీద చెమట తుడుచుకున్నాడు.

గాండ్రించిన పులి ఏమైంది???

దారి మార్చిందా – మరోవైపుగా వెళ్ళి పోయిందా? ఇంకా వచ్చే అవకాశం ఉందా? లేకపోతే తను కూర్చున్న మాటుని కనిపెట్టేసి మెల్లగా జారుకుందా? – ఎన్నో ఆలోచనలు కనకరాజు బుర్రని దొలిచేస్తున్నాయి.

టి.బి.లో కుక్క అదే పనిగామొరుగుతోంది.

టైం నాలుగు దాటిపోయింది– అడవిపుంజు ''కొక్కొరోకో'' మని కూసింది.

పులి వచ్చే జాడ ఎక్కడా కనిపించటంలేదు. తెల్లవారు జాము కావస్తుండటంవల్ల రాత్రిళ్ళు తిరిగే జంతువులు, పిట్టలు; వాటి వాటిగూళ్ళకి చేరుకుంటున్నాయి. అదే సమయంలో పగలు మేతకు బయలుదేరే పిట్టలు మేల్కొని అరుస్తున్నాయి. ఆకుల మీది నుంచి మంచు బొట్లుబొట్లుగా మాటు మీద పడుతోంటే పులి కోసం కాచుకు కూర్చొని కూర్చొని విసిగెత్తిపోయిన కనకరాజుకి చిరాకెత్తిపోతోంది.

రానురాను తూర్పు తెల్లబడుతోంది. కొండల వెనక ఆకాశం రంగులు మారుస్తోంటే కొండల మీద మంచు కరుగుతోంది.

తెల తెలవారుతోందనగానే ట్రావెలర్స్ బంగళా నుంచి కేశవరావు, నౌకరు రాములు బయలుదేరి చెట్టు దగ్గరకి వచ్చారు. కట్టిన ఎద్దు కట్టినట్టుగానే ఉండటం. చచ్చిన పులి, పక్కన లేక పోవటం చూసిన కేశవరావు జేబులోంచి డైరీ, పెన్సిలు తీసి; వెటకారంగా ''దిగరా, కనక రాజూ. ఈరోజు కూడా ''పూజ్యం'' అని రాసుకుంటాలే డైరీలో. హాయిగా బంగళాలో నిద్ర పోకుండా నీకిదేం ఖర్మరా చిట్టిబాబూ! అప్పటికీ చెబుతునే ఉన్నా; ఒద్దురా, నాయనా; నీది నీ బాబులాంటి ఇనప శరీరం కాదు ; మాటులో కూర్చొని కూర్చొని నడుంలాగేస్తాది; అని. విన్నావా? నీబాబుపులివేట చూశావా? పులికాదుకదా, కనీసం పిల్లినైనా కొట్టలేదు నీ బాబు కనకరాజు ఉరఫ్ టైగర్ రాజు.''

''పిల్లికేం ఖర్మరా. పులినే కొట్టి పట్నం తీసుకువెళ్తాను... మరో రెండు రోజులు ఆగు. ఓపిక పట్టు'' అంటూ మాట్లోనుంచి దిగాడు కనకరాజు. చిట్టిబాబు దిగి తుపాకీలు రాములుకి అందించి చెట్టు మొదట కూలబడి బండబారిన కాళ్ళని చేత్తో రుద్దుకుంటున్నాడు.

''ఒరేయ్‌రాజూ, నేను చెబుతూనే ఉన్నాను. ఈ పులి నీకు మించిన డాకూరా అని. ఎక్కడ పడితే అక్కడ అడవి నిండా దాని అడుగులు కనిపిస్తున్నాయి. అది మాత్రం కనిపించటం లేదు.

నేను ఎక్కడో పుస్తకాల్లో చదివినట్లు జ్ఞాపకం, కొందరు చచ్చిపోయిన తరువాత వాళ్ళ ఆత్మలు పులులుగా మారి వాళ్ళశత్రువులమీద పగసాధిస్తాయని. కొంపదీసి ఇదికూడా అలాంటి దయ్యం పులి కాదు గదా?'' అన్నాడు కేశవరావు.

''నీ ముఖం పులి. నీకెప్పుడూ దయ్యాలూ, దేవతలూ, పద, పద!'' అంటూ క్రిందన కట్టిన ఎద్దును విప్పి నడుచుకుంటలూ ట్రావెలర్స్ బంగళా చేరుకున్నారు.

''నిన్న రాత్రి జరిగిన సంగతంతా చెప్పరా, చిట్టితండ్రీ; డైరీలో ఎక్కిస్తాను!'' అన్నాడు కేశవరావు డైరీ తీస్తూ.

''అంకుల్! నిన్న రాత్రి గాండ్రమని పులి అరిచింది''.

''ఫరవాలేదు. మామూలుగానే చెప్పు, పులి అరిచిందని చెప్పు చాలు. గాండ్రుమని మధ్య నీ నోరెందుకు వెళ్ళబెట్టావు, పులులు గాండ్ర్ మనకపోతే కుక్కల్లాగ మొరుగుతాయా?''

''తరువాత ఏదు పందులు వచ్చాయి – రెండు''.

''ఏదుపందులా? పందికొక్కులా ?.... నువ్వు సరిగ్గా చూశావా?''

''మంచోరే. కావలిస్తే డాడీని అడగండి.''

''సరేలే, ఇంకెక్కడ మీనాన్న. మనలోలేడు. ఈజీ చైర్ మీద కాళ్ళు తన్ని పెట్టి ఎలా పడు కున్నాడో చూడు. పులుల్ని కలలుకంటుంటాడు.''

''నోర్ముయ్! శనిగొట్టు నోరూనువ్వునూ...''అంటూ మగతనిద్రలో నున్న కనకరాజు సర్రున లేచి కేశవరావు మీదికి షస్తూ; ''ఎక్కడికి బయలుదేరినా ముందు అపశకునం. ఒరేయ్! మంచిమాట నీ నోటినుంచి ఎప్పుడొచ్చి చచ్చిందిరా? ఎప్పుడూకాదూ, అవదు అన్నమాటే కదూ....''

చిట్టిబాబూ రాములూ నవ్వుకున్నారు.

''చూస్కో – ఈ పులిని కొట్టి తీరుతాను. దాని ఎత్తులకి పై ఎత్తులు వేస్తాను – అదిపులి – నేను పులిమీద బుట్రని – జ్ఞాపకం ఉంచుకో!'' అంటూ చరచరా బాత్‌రూం లోకి వెళ్ళిపోయాడు కనకరాజు.

''మీరు మరిన్ను బాబూ, అసలే పట్టుదల మనిషి. కిర్రెక్కిస్తే ఏడెక్కిపోతారు! చిన్ననాటి స్నేహితులని ఊరుకున్నారు గాని మరొకరు మరొకరైతేనా సంపేసి గొయ్యితీసి కప్పెట్టేస్తారు బాబు – కొపగిష్టోడు'' అన్నాడు రాములు నవ్వుతూనే.

బాత్‌రూం లోనించి ముఖం తుడుచుకుంటూ వచ్చిన కనకరాజు ''వాడితో మాట్లాడు తూ కూర్చుంటే వారం రోజులవరకు మాట్లాడుతాడు. ఈ సర్వమంగళంగాడికి కబుర్లు తప్పించి మరొహటిలేదు. గ్యాస్‌గాడు. రాములూ! కాస్త కాఫీ ఇయ్యి. అడవిలోకి వెళ్ళి ఒక్క ట్రిప్పు కొట్టొస్తాను.''

''నిన్నటి రోజు పూజ్యం. ఈ రోజు తిరిగి ఉదయాన్నే వ్యాఘ్రాన్వేషణకి ప్రయాణం'' అంటూ కనకరాజుకి వినబడేటట్టుగా బిగ్గరగా చదువుతూ డైరీలో రాసుకుంటున్నాడు కేశవరావు. అందరూ గొల్లున నవ్వుతున్నారు. కనకరాజు క్షణంసేపు కేశవరావు వైపు సీరియస్‌గా చూసి అందరితో పాటు తను కూడా విరగబడి నవ్వుతూ బయలుదేరాడు.

కనకరాజు బంగళా మెట్లమీద నిల్చొని చుట్టూ క్రిందనున్న అడవిని కలయచూస్తూ రైఫిల్‌లో బులెట్లు నింపి సేఫ్టీ కేచ్ నొక్కాడు. బాగా పొద్దెకింది. చిరుచలిలో పొడెండ నులివెచ్చని వేడి హాయి హాయిగా ఉంది. సూర్యకాంతిలో పొగమంచు కరిగి పోతుంటే దగ్గర్లో కొండలమీద బలిసిన తుప్పలు పొదలు ముదురు ఆకుపచ్చరంగులో స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్నాయి. దూరాన లేత నీలిరంగులో కనిపిస్తున్న పర్వత శ్రేణులమీద అక్కడక్కడ మేఘాలు తెల్లగా దూదిపింజెల్లా తేలుతున్నాయి.

పులి జాడ కోసం అడవిలో తిరుగుతున్న కనకరాజు దగ్గర్లో ఉన్న కొండజాతి పల్లెల్లో పులి భోగట్టా కనుక్కుంటున్నాడు. ఆ దగ్గర్లోనే ఈ మధ్య పులి కొండల్లోకి దిగి కర్రలు కొట్టుకున్నవాడిని పట్టపగలు ఎత్తుకుపోయిందని చెప్పారు. పది రోజుల క్రితం ప్రక్క పల్లెలో చీకటి పడుతుండగా గొడ్ల చావడిలో పడి అక్కడి గొడ్లకాపరిని ఈడ్చుకుపోయిందని ఇంకా ఇంకా గత రెండు సంవత్సరాలుగా అక్క డక్కడ జరిగిన పులి హత్యాకాండ గురించి వాళ్ళు చెప్తున్నారు. చూసిన వాళ్ళతో సహా చూడని వాళ్ళు కూడా ''ఇంత పెద్దదంటే'' ''మరింత పెద్ద''దని చెబుతున్నారు. మొత్తం మీద మన్యపు ప్రజలంతా పులిపేరు చెబితే హడలిపోతున్నారు. చీకటి పడిన తరువాత ఎవరూ బయటకు రావటంలేదు. తలుపులు బిడాయించుకొని రాళ్ళు అడ్డుపెట్టుకుంటున్నారు, తలుపులు తోసుకొని ఇళ్ళల్లో పులి జొరబడకుండా. పగలుకూడా ఒంటరొంటరిగా ఎవ్వరూ తిరగాడటం లేదు. గుంపులు గుంపులుగా అడవిలోకి పనులకు వెళ్తున్నారు. వాళ్ళ మాటలను బట్టి దాని ఖచ్చితమైన ఉనికి తెలుసుకోలేక పోతున్నాడు కనకరాజు. అలా దాని అడుగుజాడలు వెతుక్కుంటూ తిరుగుతున్నాడు. అక్కడక్కడ పులి అడుగులు కనిపిస్తున్నాయి గాని అవి చాలా పాతవి. రెండు మూడు రోజుల క్రితంవి. ఒక నీటి వాగు దగ్గర బురదలో అప్పుడే నీళ్ళు తాగివెళ్ళిన చిరుతపులి అడుగులు కనిపించాయి. అది చాలా పెద్ద చిరుతపులి అవటంవల్ల మొదట్లో దాని అడుగుల్ని చూసి పెద్దపులి అడుగులేమో అనుకున్నాడు. సూక్ష్మంగా పరిశీలించి దాని ముందరకాళ్ళు వెనకకాళ్ళు అచ్చుల ఎడంబట్టీ, దాని పంజాకొలతలబట్టి పులివేటలో అనుభవజ్ఞుడైన కనకరాజు అది అడవిలో తిరుగాడే పెద్ద జాతి చిరుతపులివని తెలుసుకున్నాడు. కొండ గుహల దగ్గరపొంచి గుహల్లోనుంచి ఏదైనా చప్పుడు వినిపిస్తుందేమోనని చెవులు రిక్కించి ఆలకించేవాడు. అవి పులి నివాస స్థానాలేమోనని. లోపలికి రాళ్ళు విసిరేవాడు. గట్టిగా సకిలించేవాడు. లోపల పులి ఉంటే పరుగున మనిషి ఉనికి కనిపెట్టి బయటకు వస్తుందని. ఒకగుహలోంచి పులికి బదులు రెండు ఎలుగ్గొడ్లు బయటకి వచ్చాయి గర్ గర్‌మంటూ. ఆడ ఎలుగు వీపుని అంటి పెట్టుకొని రెండు పిల్లలు కూడా వేలాడుతున్నాయి. మగ ఎలుగు భయంకరంగా అరుస్తూ వెనక్కాళ్ళమీద నిలబడి పోయి కనకరాజు మీదికి వచ్చేస్తోంది. కనకరాజు రైఫిల్ ఎత్తి సిద్ధంగా వున్నాడు, మరింత దగ్గరగా వస్తే కాల్చేద్దామని. అలా జంకకుండా తుపాకీ పుచ్చుకొని ఎదురుగా నిలబడ్డ కనకరాజుని చూసి బహుశా ధైర్యం చాలకో లేక పిల్లలికి హాని కలుగుతుందనో అవి మధ్యలోనే ఆగిపోయి వెనక్కి తిరిగి గుర్‌గుర్ మంటూ అడవిలోకి పారి పోయాయి. కనకరాజు విజయగర్వంతో నవ్వుకుంటూ తుపాకీ దించేశాడు. అలా అడవిలో తిరిగి తిరిగి అలసిపోతున్నాడు. ఈ రోజు రాత్రి ఎక్కడ మాటు కట్టాలో ఆలోచిస్తున్నాడు. వుండుండి అడవిలో నుంచి మ్యావ్, మ్యావ్ మని నెమళ్ళు అరుస్తున్నాయ్. రాను రాను ఎండతో బాటు కనకరాజుకి కడుపులో ఆకలి రాజుకొంటూంది. బంగళాకి తిరుగు

ప్రయాణం కట్టాడు. అడవిబాట విడిచి పెట్టి బంగళా రోడ్డు మీదికి వచ్చాడు. అక్కడికి మూడు ఫర్లాంగుల దూరంలో బంగళా కనిపిస్తోంది. అలా పది గజాలు రోడ్డుమీద నడిచాడో లేదో ఠక్కున బ్రేకు వేసినట్లు ఆగాడు. ఒళ్ళు జల్లుమంది. రోడ్డుమీద వంగి తీక్షణంగా పరిశీ లిస్తున్నాడు.

అలా ఒంగొనే నడుస్తున్నాడు –

పులి అడుగులు !

క్రితం రాత్రే ఆ రోడ్డువెంట పులి నడిచి వెళ్ళింది !

ఆ అడుగులు ఫ్రెష్‌గా ఉన్నాయి.

రోడ్డుమీద పేరుకుపోయిన ధూళిలో పులి అడుగులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ అడుగుల్ని బట్టి చూస్తే మాంచి వయసులో ఉంది పులి. దారిపొడుగునా దాని అడుగు లున్నాయి. వాటిని అనుసరిస్తూ వెతుక్కుంటూ కనకరాజు ఎక్సయిట్‌మెంట్‌తో నడుస్తున్నాడు. అడుగులు బంగళావైపు మళ్ళాయి. అది చూసిన కనకరాజు నిర్ఘాంతపోవటమే కాకుండా షాక్ అయాడు. అడుగులు బంగళాని సమీపిస్తున్నాయి. రెట్టింపు ఆత్రుతతో వాటిని చూస్తూ కనకరాజు నడుస్తు న్నాడు. పెద్దపులి బార్బ్‌డ్ వైర్ ఫెన్సింగు దూకింది. అది కుప్పించి ఎగిరిన జాగాలో దాని వెనక కాళ్ళు అడుగుల అచ్చులు లోతుగా దిగున్నాయి. కనకరాజు గబగబా ఫెన్సింగు గేటు తోసుకొని లోపలికి వెళ్ళి చూశాడు. క్లియర్‌గా పులి దూకి వచ్చిన గుర్తులు కనిపించాయి. బంగళాలో తలుపులు మూసుకొని చిట్టిబాబు, రాములు, కేశవరావు పేకాట ఆడుతున్నారు. బంగళా చుట్టూ పులి అడుగులు కనిపిస్తున్నాయి. వాటిని చూసుకుంటూ బంగళా వెనకాతలకి వెళ్ళాడు. వెనకాల వరండా అరుగుమీద ఏవో మరకలు కనిపిస్తే వాటిని చూడ్డానికి కనకరాజు వరండా ఎక్కాడు. అక్కడ వరండా అరుగు మీద స్పష్టాతి స్పష్టంగా మంచులో తడిసిన పులి బురద అడుగుల అచ్చులు కనిపించాయి – అంటే పులి బంగళాలోనికి వచ్చి తిరగడమే కాకుండా వరండా కూడా ఎక్కింది!!

కనకరాజు లోపలి వాళ్ళని పిలుద్దామనుకున్నాడు, మరేం ఆలోచించాడో ఏమో పిలవలేదు. క్షణంసేపు సాలోచనగా పెదవి కొరుక్కుంటూ శూన్యంలోకి చూశాడు. కొంచెం సేపు ఏదో ఆలోచిస్తూ కళ్ళుమూసుకొని వరండామీద పచార్లుచేశాడు. వరండా దూకాడు. నేలమీద ఏవేవో పిచ్చి గీతలు గీశాడు. వాటిని చూస్తూ తీక్షణంగా ఆలోచిస్తున్నట్లు మాసిన గడ్డాన్ని చేత్తో బకురుకున్నాడు. చరాలున లేచి పరుగెత్తుకుంటూ గేటుతలుపు తీసుకుంటూ రోడ్డుమీదికి పరుగెత్తాడు. పులి అడుగులున్న దారిపొడవునా అటూ ఇటూ పరుగు లెత్తాడు. ఉండుండి రోడ్డుమీదినుంచి బంగళావైపు వెనక్కి తిరిగి చూస్తున్నాడు. పులి అడుగుల్ని ముద్దు పెట్టు కున్నాడు. చిరునవ్వు నవ్వుతూ చిటికవేసి బాణంలా దూసుకుంటూవచ్చి బంగళామెట్లు రెండు అంగల్లో గెంతుకుంటూ ఎక్కి తలుపుల్ని దబదబ బాదాడు.

చిట్టిబాబు తలుపు తెరిచాడు.

"రాములూ, ఆకలేస్తోంది. వడ్డించు! తిని ఒక్క కునుకుతీస్తాను. సాయంకాలం కాకుండానే మాట్లో ఉండాలి. చలికాలం... త్వరగా చీకటి పడిపోతుంది." అంటూ తుపాకీ మూలనపారేసి స్నానానికి బట్టలు విప్పుతున్నాడు కనకరాజు.

"డాడీ! అయామ్‌సారీ! ఈరోజు నేను మాటు కాపుకి రాలేను, అయామ్ టైర్డ్ టూమచ్!"

''ఓకే బోయ్! ఇవ్వాల్టికి నువ్వు రెస్టుతీసుకో, ఈరోజు నాతో ''సర్వమంగళంగాడ్ని'' తీసుకు పోతాను.''

''నన్నా? నేను చచ్చినారాను.''

''నిన్ను చంపైనా తీసుకువెళ్తాను. ఈ పదిరోజులు మూడు పూటలూ మెక్కి కూర్చొని చీట్ల పేకలు, భావకవిత్వం, సొల్లుకబుర్లు ఆడుతూ కూర్చుంటున్నావు – ఒరే చచ్చువెధవా! పదరా! – రాత్రి అడివిలో ఉండే థ్రిల్‌ని చూద్దువుగాని. ఎప్పుడు పేదవాళ్ల ఆకలి, ప్రియురాళ్ళ వాలుచూపు లేనా? – ఎడ్వంచరస్‌గా, మాన్లీగా వుండాలిరా, నీ కవిత్వం; రాతలూను! పదపద!''

''రమ్మంటావా ! లేకపోతే చంపుతానంటావా! చంపేసినా చంపేస్తావ్, అసలు చావుకే నేనిక్కడికి వచ్చాను, నేను తింటూ ఇక్కడ కూర్చుంటున్నానా? పగలంతానీతో తిప్పి నన్ను చంపటం లేదూ? ఇప్పుడు రాత్రిళ్ళు కూడా చంపు. నీతో తిరుగుడికే సరిపోయింది, ఇంకా కవిత్వం ఏమిటి; నా బొంద! ఊఁ, సరే – పదరా నాయనా, వస్తాను; ఖర్మ!''.....

''రాత్రంతా ఎలాగూ నిద్రుండదు. ఇప్పుడే ఒక్క కునుకులాగేయ్ మెక్కావ్‌కదా!'' అంటూ స్నానానికి వెళ్ళిపోయాడు కనకరాజు.

''మాటల్లో మరచిపోయాను. ఏదీ! చిట్టిబాబూ ముక్కలు తిప్పు.''

'' రెండు ఆసులు, కింగ్''

''మూడ్రాజులు – నీ పని సర్వమంగళం'' అంటూ ఆటమీద డబ్బు ఊడ్చుకున్నాడు కేశవరావు.

'' ఇక ఆట ఎత్తేద్దాం బాబు, మీరు పడుకోండి. నాకూ నిద్రొస్తోంది'' అంటూ చిట్టిబాబు లేచిపోయాడు. కేశవరావు కూడా లేచి ప్రక్కగదిలో పడుకున్నాడు.

స్నానం చేసి భోజనం చేసిన కనకరాజు పడుకున్నాడే గాని; నిద్రపట్టక అటు ఇటు దొర్లు తున్నాడు. రాములు వేటకి కావలసిన సరంజామా అంతా చూస్తున్నాడు. టార్చిలైటు, బేటరీలు, ఉలెన్ కోటు, వాటర్ బాటిల్ అన్నీ కిట్ బాగ్‌లో సర్దాడు. తుపాకీని క్లీన్ చేశాడు. తూటాల్ని తోలు పెట్టిలో సర్దాడు.

సాయంకాలం నాలుగు గంటలకల్లా అంతా తయారైపోయారు. కేశవరావు, కనకరాజు రాత్రి భోజనం కూడా చేసేశారు. భోజనం దగ్గర కొంచెం తలనొప్పిగా ఉందని రెండు మూడు సార్లు తలరాసుకున్న కనకరాజుని చూసి చిట్టిబాబు '' పోనీ, డాడీ; తలనొప్పిగా ఉందంటున్నారు. ఈరోజు ఉండిపోయి రేపు వెళ్ళకూడదా?'' అన్నాడు.

''నో, నో! ఈరోజంతా వేస్టయిపోతుంది!'' అంటూ గబగబా అన్ని పనులు ముగించుకొని బయలుదేరారు. మాటుదగ్గర కట్టడానికి ఎద్దునుకూడా స్వయంగా కనకరాజే తోలుకొని, రాత్రి దానిక్కావలసిన పచ్చగడ్డి కూడా పట్టుకొని బయలుదేరాడు.

''డాడ్! విష్ యు బెస్టాఫ్ ది లక్'' అన్నాడు చిట్టిబాబు

''థాంక్యు; టేక్ రెస్ట్, మై బోయ్''

''లెటజ్ డ్రింక్ ఎ టోస్ట్ టు ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్ టుమారో'' అన్నాడు కేశవరావు.

'' ఒరేయ్, సర్వమంగళంగా! మాట్లోకూర్చొని మళ్ళీ అపశకునపు మాటలు అన్నావో, మాట్లో

నుంచి కిందికి తోసేస్తాను; తెలుసా?'' అని కనకరాజు అంటుంటే అందరూ నవ్వారు.

తుపాకీ పట్టుకొని అందరి కంటే ముందుగా నడుస్తున్నాడు కేశవరావు. వెనకాల నడుస్తున్న కనకరాజు ఏదో జ్ఞాపకానికి వచ్చి రాముల్ని పిలిచి '' డేగర్ సంచిలో పెట్టావా, - బీరువాలో పెట్టావా?'' అని అడిగాడు.

'' అరె, తొందర్లో మరచిపోయాను; పదండి'' అంటూ రాములు వెనక్కి వెళ్ళాడు. ఎద్దుని చిట్టిబాబుకి అప్పగించి కనకరాజు కూడా రాములు వెంటే బంగళాలోకి వెళ్ళి; బీరువాలో డేగర్ తీసుకొని బయటకు వస్తూ ; రాములుతో ఏదో చెప్తున్నాడు.

'' సరేసర్;.. తప్పకుండానూ! నేను పడుకుంటే కదా?'' అన్నాడు రాములు.

అడవిలోకి వెళ్తున్న కేశవరావుని, కనకరాజుని కనిపించే వరకు బంగళా వరండా మీదినుంచి టాటాలు చెప్పారు చిట్టిబాబు, రాములు.

క్రితంరాత్రి కట్టిన మాటుదగ్గరే ఎద్దునుకట్టాడు కనకరాజు . కేశవరావుని చెట్టెక్కి మాటు లోకూర్చోమన్నాడు. చుట్టుప్రక్కలున్న చిన్న చిన్న పొదల్నీ, చెట్టుకొమ్మల్నీ నరికాడు చెట్టుమీద మాటుకట్టడానికి. కేశవరావు చెట్టెక్కడానికి ప్రయత్నిస్తూ ఎక్కలేక జారిపోతున్నాడు. కనకరాజు చురచురలాడుతూ '' ఊఁ, నా భుజం మీద ఎక్కు!'' అని తన భుజాల మీద కేశవరావుని ఎక్కించు కొని చెట్టు కొమ్మమీదికి ఎగదోశాడు. ఒగుర్చుకొంటూ చెట్టుకొమ్మని పట్టుకొని వణికి పోతూ ఎలా గైతేనేం ఎక్కలేక ఎక్కలేక కొమ్మమీద మాటు కట్టిన మంచెమీద కూర్చున్నాడు కేశవ రావు. తనతో తెచ్చిన పచ్చగడ్డిని ఎద్దుదగ్గరపడేశాడు మేతకి కనకరాజు, ఎద్దును కట్టిన గుంజని చేతితో లాగిలాగిగట్టిగాఉందోలేదో చూశాడు. ఒక్కొక్కసారిఎరగా కట్టిన ఎద్దులు,గేదెలు విదిలించు కొని గుంజని ఊడబెరుక్కొని పారిపోవడంకద్దు. క్రింద అన్నీ సరిగ్గా ఉన్నాయి అనుకున్న తరువాత చెట్టెక్కి క్రితంరోజు మాటుకు కట్టిన పాత కొమ్మల్ని జాగ్రత్తగా తీసేసివాటిస్థానే క్రొత్తగా నరికితెచ్చిన కొమ్మల్ని పేర్చాడు. బయటినుంచి చూడ్డానికి మామూలు చెట్టు భాగంగా భ్రాంతి కలిగేటట్లుగా మాటుని సవరించాడు టైగర్ రాజు. రైఫిల్ క్లాంప్‌కి టార్చిలైటు బిగించి, దుప్పటి దగ్గర పెట్టుకొని పులి రాకకోసం ఎదురు చూస్తున్నాడు.

సాయంకాలం అవుతోంది. పడమటి కొండలు అస్తమిస్తున్న సూర్యకాంతితో ఎరుపెక్కు తున్నాయి. కొండల నీడలు లోయలో విస్తరించుకుంటున్నాయి. రాను రాను మసగ చీకట్లు ముసురుకుంటున్నాయి. అదే సమయంలో మసకబారుతున్న ఆకాశంపై తూర్పు దిశలో చంద్రుడు ఉదయించాడు. అడవిని వెన్నెలతో తడుపుతున్నాడు. వెన్నెట్లో చెట్లనీడలు దోబూచులాడు తున్నాయి.

''కాఁవ్'' మని కంచు గొట్టంలో నించి అరిచినట్లు పోతు దుప్పి అరిచింది.

ఉండుండి అడవిలో అడవిదున్న రంకెలు వేస్తుంటే కేశవరావు ఒళ్ళు జలదరిస్తోంది.

మాటులో నించి వెనకవైపు వెన్నెల్లో ట్రావెలర్స్ బంగళా స్పష్టంగా కనిపిస్తూంది. దాని వెనకాల గుబురుగా లేచిన చింత చెట్టు మీద వెన్నెల; ఆకులమీద వెండి జల్లినట్లుంది.

అలా రాత్రి పదిదాకా కాచుక్కూర్చున్నారు. ఎక్కడా అలికిడి లేదు. వెన్నెల కూడా కృంగి పోతోంది. చీకట్లతో పాటు దట్టమైన పొగమంచుకూడా క్రమ్ముకొంటోంది. పొదల్లోనుంచి వేల

సంఖ్యలో మిణుగురులు మెరుస్తున్నాయి. అడవంతా నిశ్శబ్దం ఆవరించింది. గుంజకి కట్టిన ఎద్దు తోకతో దోమల్ని తోలుకోవటం సడి తప్ప ఏమీ వినిపించటంలేదు. సడన్‌గా కనకరాజు ఒళ్ళు గగుర్పొడిచింది. ఇలా అకారణంగా కలిగిన గగుర్పాటుకు కనకరాజు విస్తుపోతున్నాడు – భయం-బితుకు – బహుశా సిక్స్త్ సెన్స్ ఏమో !

ట్రావెలర్స్ బంగళాలో కుక్క మొరగటం మొదలెట్టింది!. కనకరాజు అతి నెమ్మదిగా ఎర్రవైపు నుంచి వెనక్కి తిరిగి బంగళా వైపు తదేక దీక్షగా చూస్తున్నాడు. ఊపిరి భారంగా పీలుస్తుండడం కేశవరావు గమనించాడు. అర్థంకాక తను కూడా బంగళావైపు చూస్తున్నాడు. బంగళా తలుపులు తెరుచుకున్నాయి. హరికేన్ లాంతరు వెలుతురు గుమ్మంలో నుంచి వరండామీద పడింది.

''కనకరాజూ, ఎవరుచెప్మా తలుపుతీశారు ; బంగళాలో ?'' అన్నాడు చెవి దగ్గర కేశవరావు.

''శ్! మెల్లగా మాట్లాడు,''

''ఎవరో వస్తున్నట్టున్నారు ...... చేతిలో లాంతరుంది.''

''శ్! రాములు వస్తున్నాడు''

''ఇంత రాత్రప్పుడా! ఎందుకు?''

''కాఫీ తెస్తున్నాడు .... నాకోసం''

''వాట్!!!''

బంగళావైపు చూస్తునే ఎడమచేత్తో కేశవరావు తల దగ్గరగా లాగి చెవిలో ఏదో మెల్లగా గుసగుస లాడి తిరిగి తుపాకీని బంగళా వైపు గురిపెడ్తూ మోకాళ్ళమీద కూర్చొని దూరంగా తనవైపు వస్తున్న లాంతర్ని చూస్తున్నాడు కనకరాజు.

కుక్క మొరగటం లేదు.

లాంతరు పట్టుకొని గేటు దాటి రాములు వస్తున్నాడు.

ఉన్నట్టుండి కేశవరావు ''యూ, రోగ్! '' అంటూ కోపంగా అరిచాడు. '' ఒరేయ్ కనకరాజూ! నువ్వు మనిషివి కావురా. రాక్షసుడివి. ఎంత కుట్ర పన్నావురా. నువ్వంటే కుక్కకంటే విశ్వాస పాత్రుడిగా మెలిగే రాముల్ని పులికి ఎరగా పెట్టడానికి ప్లాన్ చేశావా? ఇది నీకు న్యాయం కాదు సుమా! – వెళ్ళిపోమను . పారిపొమ్మని కేకవెయ్యి ......''యు ఆర్ ఎ హార్ట్‌లెస్ బీస్ట్... నువ్వు...'' అంటూ పిచ్చివాడిలా ఊగిపోతూ మంచె మీదనుంచి, గట్టిగా; వస్తున్న లాంతరు వైపు అరిచాడు ''రాములూ! రాకు...... వెనక్కి తిరిగి పారిపో... పులి ... పులి....''

అరుపు మధ్యలోనే ఎడంచేత్తో నోరునొక్కేశాడు కనకరాజు. కనకరాజు ఇనపపట్టుకి గిలగిల లాడిపోతూ ఊపిరి ఆడక గింజుకుంటున్నాడు కేశవరావు .

అదే సమయంలో.... అడవి దద్దరిల్లి పోయేటట్లు గాండ్రు మని పులి అరుస్తూ రాములు మీద గభాలున దూకింది – చేతిలో లాంతరు దూరంగా తుళ్ళిపడిపోయింది... మనిషి ఆర్తనాదం మధ్య లోనే అణగారిపోయింది. దేనినో పట్టుకొని పటపటమని విదిలిస్తోన్న చప్పుడూ..... దబదబమని బాధతో కాళ్ళు తన్ను కున్న సవ్వడీ క్రమేణా ఆగిపోయాయి..... నిశ్శబ్దం.... జర్ జర.. జర.. జర్ దేన్నో ఈడ్చుకొని వెళ్ళున్నచప్పుడు..... పెద్దపులి రాముల శవాన్ని పొదల్లోనుంచి ఈడ్చుకుపోతున్న చప్పుడు రానురాను దూరమౌతుండడం చీకట్లో స్పష్టంగా వినిపిస్తోంది. నిశ్శబ్దం.

కనకరాజు పూర్తిగా నిశ్శబ్దం అయిందాకా కేశవరావు దవడ్ని పట్టి నొక్కి ఉంచి తరువాత వదిలేశాడు.

''మై... గ్గాడ్! ఎంతఘోరం. నిన్ను ముక్క ముక్కల క్రింద నరికినా పాపం లేదురా.... ఎంతటి పన్నాగం! తలనొప్పిగా ఉందని రాత్రి పది దాటిన తరువాత మాటు దగ్గరికికాఫీతెమ్మనమని రాముల్ని పులికి ఎరగా పెట్టావా? – దగ్గరలో పులి తిరుగు తున్నా నీకు తలనొప్పిగా ఉందనగానే పులి సంగతే గుర్తుకు రాలేదు రాములికి. ఎంతటి అమాయకుడురా! నీపట్ల ఎంతటి విశ్వాసంరా. మనం పెంచిన కుక్కకి గూడా మనం హాని తలపెట్టమే; అలాంటిది నీ నమ్మినబంటుని రాముల్ని పులికి బలిపెట్ట డానికి నీ మనస్సెలా ఒప్పిందిరా పాపాత్ముడా?... క్రూరాతి క్రూరంగా చంపించే శావ్ గదట్రా!'' అంటూ మతిపోయిన వాడిలా జుట్టు పీక్కుంటూ ఏడుస్తూ కనకరాజుని తిడు తున్నాడు. కనకరాజు దగ్గర పనిలో చేరిన దగ్గరనుంచీ రాముల్ని బాగా ఎరుగును కేశవరావు. ఎంతటి విశ్వాసపాత్రుడో బాగా తెలుసును. ''బాబుగారి గాలి సోకితే అమడదూరంలో పులి రాదు.'' అనేవాడు. అలాంటి వాడిని దారుణంగా చంపించేశాడు కనకరాజు.

కనకరాజు ఏమీ మాట్లాడడం లేదు. మరీ తిడుతోంటే రెండు మూడు సార్లు కేశవరావు ముఖం లోకి తీక్షణంగా చూశాడు. చీకట్లో కనకరాజు కళ్ళు పులి కళ్ళలా భయంకరంగా కనిపించాయి. కేశవరావుకి. ఒకళ్ళతో ఒకరు మాట్లాడుకోవటం లేదు... చుట్టూ నిశ్శబ్దం.... ఉండుండి కేశవరావు బెక్కుతూ కళ్ళు తుడుచుకుంటున్నాడు.

ఇంకా పొద్దెక్కక ముందే మాటు దిగిపోయాడు కనకరాజు– కేశవరావుని కూడా దింపాడు. కేశవరావు తాగిన వాడిలా తూలుతూ పిచ్చిచూపులు చూస్తున్నాడు.

'' బీ బ్రేవ్! ఇంటికి వెళ్లి పడుకో. అదే సర్దుకుంటుంది. ఈ సంగతి నీకూ నాకూ తప్పించి మరో నరమానవుడికి తెలీకూడదు. నువ్వూ నీ కుటుంబం నా డబ్బుమీద బ్రతుకు తున్నారు. విశ్వాసంగా ఉండటం నీ విధి. ఈ సంగతి నేను వచ్చేవరకూ చిట్టిబాబుకికూడా చెప్పకు అప్‌సెట్ అయిపోతాడు... ఇప్పటికే చాలా దూరం శవాన్ని ఈడ్చుకుపోయుంటుంది. వెళ్ళి వెతకాలి.''

''వెతుకు. బాగా వెతుకు. కళ్ళల్లో కాగడాలు పెట్టుకొని మరీ వెతుకు. నీకోసం ఆత్మబలి అయిపోయిన రాములి శవాన్ని వెతికి దానిమీద మాటువేసి పులినికొట్టి ఘనుడ వనిపించుకోరా టైగర్ రాజూ! పులి శవంతో పట్నం అంతా ఊరేగు. పూలమాలలు వెయ్యించుకో. బార్బరస్..... ఇన్‌హ్యూమన్... విలనిష్..'' అంటూ కనకరాజు ముఖంమీద చెయ్యిపెట్టి తాటిస్తూ పిచ్చివాడిలా కేకలేస్తున్నాడు అడవిలో.

''కేశవా!'' అడవిదున్నలా బలిసిన కనకరాజు ఏనుగులా ఘీంకరిస్తూ తుపాకీ చూపించాడు.

''కాలుస్తావా? కాల్చరా. మనిషిప్రాణాలతో చెలగాటాలాడటం నీకుకొత్తకాదు.. రాములూ ... అమాయకంగా బలి అయిపోయావు కదరా. డబ్బుతోనూ, కీర్తితోనూ, పొరలు కమ్మిన వీడి కుట్రకి అమానుషంగా బలి అయిపోయావు కదట్రా... రాములూ!'' అంటూ మతి భ్రమించినవాడిలా కేకలేస్తూ తూలుకుంటూ బంగళా వైపు పరిగెత్తాడు కేశవరావు.

కనకరాజు, పులి రాములిమీదకి దూకిన జాగా దగ్గరికి వెతుక్కుంటూ వెళ్ళాడు. పగిలి పోయిన లాంతరు కనిపించింది. దగ్గర్లో వున్న తుప్పలన్నీ చిందరవందరగా తొక్కేసి ఉన్నాయి.

నేల మీద పులిగోళ్ళ చారలు, మనిషి తన్నుకున్న జాడలు; స్పష్టాస్పష్టంగా మసగ వెలుతుర్లో కనిపించాయి. ఒక పొదలో కాఫీ ఫ్లాస్కు పడుంది. పొదలమీద అక్కడక్కడ నల్లటి మరకలు కనిపించాయి. కనకరాజు వాటిని చేత్తో తాకాడు. జిగురు జిగురుగా తగిలింది. కంటికి దగ్గరగా పెట్టుకుని చూశాడు. నెత్తురు! నెత్తురుని చూడగానే రాములు జ్ఞప్తికి వచ్చి ఒళ్ళు జలదరించింది. క్షణం సేపు ఆగి, తిరిగి సర్దుకుని కొంతదూరం వెతికాడు. పులి శవాన్ని ఈడ్చుకుపోయిన జాడ కనిపించింది. నేలమీద వేలాడుతున్న శవం కాళ్ళు రాసుకుంటూ వెళ్ళిన జాడలు దారిపొడుగునా కనిపిస్తున్నాయి. బరువును ఈడ్చుకు వెళ్తుండడం వల్ల పులి అడుగులు లోతుగా కనిపిస్తున్నాయి.

శవాన్ని మెడ పట్టుకుని ఈడ్చుకి వెళ్ళినట్టుంది, పులి. దారి పక్కన పొదలమీదా, కొమ్మలమీద అక్కడక్కడ నెత్తురు పడింది బొట్లుబొట్లుగా.

అలా బాటలో ప్రక్కనున్న రాళ్ళని, పొదల్ని, నేలమీద జాడల్నీ వెతుక్కుంటూ, వాటిని అనుసరిస్తూ; తుపాకీని ఏ క్షణాన్నైనా ఉపయోగించడానికి సిద్ధంగా ఉంచుకొని; చాలా చాలా దూరం నడిచాడు కనకరాజు. బాగా వెలుగొచ్చేసింది. చెట్లమీద పిట్టలు గోలచేస్తున్నాయి. పొదల మీద పిగిలి పిట్టలు గుంపులు గుంపులుగా ఎగురుతున్నాయి. రానురాను, పులి, బాటని విడిచిపెట్టి తుప్పల మధ్యనుంచి ఇరుకు బాటగుండా కొండవైపు శవాన్ని ఈడ్చుకు వెళ్ళింది. ఒక దగ్గర పొదల్లో ఇరుక్కొన్న శవాన్ని తన బలాన్ని ఉపయోగించి లాగినపుడు మనిషి చర్మం పేలికలు పొదలకి అంటుకొనున్నాయి. తల వెంట్రుకలు కూడా ముద్దగా తుప్పలో చిక్కుకొనున్నాయి. కొండ దిగువున పెద్ద నెత్తుటి మడుగుంది. అక్కడికి వచ్చేటప్పటికి పులి బాగా అలిసిపోయినట్లుంది. కొండ మీదికి శవాన్ని మోసుకొని ఎక్కడానికి వీలుగా పట్టు మార్చింది. అప్పుడు విడిచిన పట్టులోంచి నెత్తురు కారి మడుగు కట్టింది. పులి శవాన్ని ఈడ్చడం మానేసి నోటితో పట్టుకొని ఎత్తి ఒక్క విదిలింపుతో భుజాన్ని వేసుకొని బరువంతా వీపుమీద మోసుకొని కొండెక్కుతోంది. అది ఎక్కుతున్నప్పుడు ఒకచోట జారిన అడుగుల గుర్తు; రాయి దొర్లిన గుర్తు; కనిపెట్టి కనకరాజు కూడా ఆ జాడ వెంటే కొండెక్కాడు. కొండ గులకరాళ్ళతోనూ, తుప్పలతోనూ ఏటవాలుగా ఉంది. కనకరాజు రొప్పుకుంటూ కొండెక్కుతున్నాడు. చెమట్లు కక్కుకుంటున్నాడు. కొన్నిచోట్ల తుపాకీ ఎడంచేత్తో పట్టుకొని పాకురుకుంటూ కొండ ఎక్కుతున్నాడు. కొంత దూరం వెళ్ళిన తరువాత నెత్తురు జాడ కనిపించింది. కుదుపుకి శవం గాయాల్లోనించి నెత్తురు కారింది. ఒకచోట నెత్తురు జాడ వెంట చిన్న పిల్లాడి అడుగుల్లాంటి ఎలుగుబంటి పాదాల గుర్తులు కనిపించాయి కనకరాజుకి. పులి వెళ్ళిన తరువాత అదే బాటగుండా ఎలుగుబంటి వెళ్ళుంటుంది. దారిపొడవునా పడున్న నెత్తురు వాసన కిట్టక అది దారి మళ్ళిపోయింది.

మధ్యాహ్నం ఎండ కొండరాళ్ళ మీదినుంచి ప్రతిఫలిస్తూ చురచురలాడించేస్తోంది. అలసిపోతున్నా, ఆకలి దహించేస్తున్నా; పట్టిన పట్టు విడవని కనకరాజు అలా పులి జాడ వెంబడే రెండు కొండలు ఎక్కిదిగి ఒక లోయలోకి వచ్చాడు. అక్కడ చెట్టు మీద ఒక బొండుకాకి కనకరాజు రాక గమనించకుండా వెనక్కి తిరిగి ఎదురుగుండా దేని వైపో చూస్తూ అరుస్తోంది. దాని అరుపు ఆ లోయలో వికృతంగా వినిపిస్తోంది. దగ్గర్లో ఏదో మేతకోసం అలా అరుస్తోందని కనకరాజు అనుకుంటుండగానే దూరంలో చెట్టుమీద కొన్ని రాబందులు టపటప రెక్కలు కొట్టుకుంటూ

ఎగరటం కనిపించింది. కనకరాజు ఆగి పరీక్షగా చూస్తూ మెల్లగా చప్పుడు చేయకుండా చెట్లమాటు నుంచి నక్కినక్కి చెట్టుదగ్గరకు వెళ్ళాడు. ఇంకా అంతదూరంగా ఉండగానే చెట్టు క్రింద పొదల్లోనించి ఈగలు జుమ్మున లేచాయి..... కనకరాజు ఒంగొని పొదల సందుల్లోకి చూశాడు... శవం పడుంది. నగ్నంగా పడున్న సగం తినేసిన శవం మీద అక్కడక్కడ చినిగిపోయిన గుడ్డ పీలికలు అంటి పెట్టుకొనున్నాయి. తల ఆవలివైపు తిరిగుంది. పక్కనే పేగులు, పొట్ట; ముద్దగా పడున్నాయి. దగ్గరగా వెళ్ళబోయాడు. రాములు శవాన్ని చూసే ధైర్యం చాలలేదు. జ్వరం వచ్చినట్లు ఒళ్ళంతా అదో మాదిరిగా అయింది. శవాన్ని సగంతిని అక్కడే వదిలేసి దగ్గర్లో ఉన్న ఏ నీటివాగు దగ్గరికో వెళ్ళుంటుంది పులి ; దాహం తీర్చుకోడానికి. తిరిగి మిగతా కళేబరాన్ని తినడానికి పొద్దు గుంకే లోగానే వస్తుంది. టైంలేదు. కనకరాజు చుట్టూ చూశాడు. మాటు కట్టడానికి దగ్గర్లో ఎక్కడా పెద్ద చెట్లులేవు. అన్నీ బలిసిన తుప్పలూ, డొంకలున్నూ. శవందగ్గర్లో ఉన్న ఒక్కచెట్టూ ఆకులు రాలిపోయిన ముసలి మొరడు . పులి కంటపడకుండా దాగోని కూర్చోడానికి వీలుపడదు. మరి కాస్త దూరంలో, అంటే ; సుమారు పదకొండు గజాల దూరంలో. అడవి ఉసిరిచెట్టు ఉంది. కాని అది తగినంత ఎత్తులో లేకపోవటంవల్ల దానిమీద కూర్చోటం శ్రేయస్కరం కాదు , సరికదా; ప్రమాదం కూడా అనుకున్నాడు కనకరాజు. పులి ఒక్క ఎగురులో దానిమీద కూర్చున్న మనిషిని లాగెయ్యగలదు. అప్పటికప్పుడే మధ్యాహ్నం దాటిపోయింది. ఏక్షణాన్నయినా పులి తిరిగి వస్తుంది. వేళదాటి పోతోంది . పదిహేను గజాల దూరంలో నేలమీద బలిసిన పెద్ద తుప్ప, దాన్ని పెనవేసు కొనున్న అడవి తీగలు మాటుకు అనువుగా ఉన్నాయి. కాలయాపన చెయ్యకుండా మెల్లిగా పాకుకుంటూ వాటి మధ్యలో దూరాడు కనకరాజు. బూటు కాళ్ళతో తొక్కి నేల చదును చేసుకొని, ఆ మధ్యలో కూర్చున్నాడు. కొమ్మల్ని తీగల్ని విరిచి తను కనపడకుండా చుట్టూ దోపాడు. శవాన్ని చూడ్డానికి, తుపాకీని ఎయిమ్ చెయ్యడానికి వీలుగా; పొదకి చిన్న సందు చేశాడు. రైఫిల్‌ని సరి చూసు కొని ఏ మాత్రం కదలకుండా శిలా ప్రతిమలా కూర్చున్నాడు.

శవంమీద ఈగలు, పురుగులు ముసురుతున్నాయి. ఎండి పోయిన నెత్తురు గాలివీస్తున్నప్పుడల్లా నీచువాసన కొడుతోంది. సగం తినేసిన వీపులోనుంచి దుమ్ములు తెల్లగాపైకి తన్నిపెట్టి నించు న్నాయి. పొదల్లో కూర్చున్న కనకరాజు కనిపించకపోవటం వల్ల ఎగిరిపోయిన రాబందులు ఒక్కొ క్కటి రెక్కలు టపటప కొట్టుకుంటూ జుయ్ జుయ్‌మంటు ఏరోప్లేన్లలా శవంమీదికి దిగుతున్నాయి. ఒక దానితో ఒకటి పోట్లాడు కుంటూ, కీచులాడు కుంటూ శవాన్ని పీక్కు తింటు న్నాయి. పేగుల్నీ పొట్టనీ అవి కెలుకుతూ పీకుతున్నప్పుడల్లా గుప్‌మని భరించరాని కంపుకొడు తోంది. అడవి ఉసిరి చెట్టుమీద రెండు గెద్దలు శవాన్ని అదేపనిగా చూస్తున్నాయి. రాబందులు ఉండడంవల్ల దగ్గరకు రాలేకపోతూ డిసెప్పాయింటింగా సకిలిస్తున్నట్లు అరుస్తున్నాయి. కాకులు గోలచేస్తూ దగ్గరలో వాల్తూ రాబందులకి బెదిరిపోయి తిరిగి అరుచుకుంటూ ఎగిరిపోతున్నాయి.

దూరంగా ఏదో జంతువు వస్తున్న చప్పడు!

కనకరాజు చెవులు నిక్కిస్తూ తుపాకీ సిద్ధంగా ఎత్తాడు.

ఎండుటాకులు చిట్లుతున్న చప్పుడు.... ఏదో జంతువు . పెద్దదే - రానురాను దగ్గరౌతోంది. పొదలు కదుల్తున్నాయి.... పొదల మధ్యనుంచి జంతువు కనిపించింది. శరీరం మీద చారలు-

కనకరాజు వేలు ట్రిగ్గర్ మీదకు వెళ్ళింది- తుప్ప వెనకాలనుంచి పెద్దతల వికృతంగా బయటకి వచ్చింది. చెవులు గాడిద చెవుల్లా వున్నాయి- దుమ్ములగొండు! - కుచ్చుతోక ఊపుతోంది.

దుమ్ములగొండు తలపైకెత్తి ముక్కుతో గాలిలో వాసన చూస్తోంది. గాలిలో తేలుతున్న నెత్తుటి వాసన్ని అది పసిగడుతోంది. తరువాత మోరదించి కుక్కలా నేలని వాసన చూసుకుంటూ శవం దగ్గరకు వచ్చింది. దుమ్ములగొండు రాగానే రాబందులుగజిబిజిగా రెక్కలు కొట్టుకుంటూ పరుగెత్తి పరుగెత్తి సర్ సర్‌మని గాలిలో తేలిపోతూ ఎగిరిపోతున్నాయి.... దుమ్ముల గుండు శవాన్ని పట్టుకొని లాగుతోంది. లాగలేక లాగలేక బలం పూర్తిగా శవాన్ని ఈడ్చుకు పోతోంది. మాటులో కూర్చున్న కనకరాజు రెస్టులెస్ అయిపోతున్నాడు దుమ్ముల గొండు శవాన్ని లాక్కుపోతుంటే. ఆలస్యం చేస్తే అడవిలోకి ఈడ్చుకుపోతుంది. పులివచ్చే ఛాన్సు పోతుంది. దాన్ని ఎలాగైనా తోలేద్దామని మాటులోంచి లేచి నిలుచుని ''శ్! శ్!'' అని చెయ్యిని విదిలిస్తూ రెండు మూడు మంటి బెడ్డలు దాని వైపు విసిరాడు. కనకరాజుని చూడగానే అది శవాన్ని వదిలేసి దాని మేతని పాడుచేసి నందుకు నిరసనగా, హిస్టీరిక్‌గా, నవ్వినట్లు అరుచుకుంటూ; మధ్యమధ్యన ఆగి , వెనక్కి తిరిగి చూసు కుంటూ, కుంటుతూ పరిగెత్తినట్లు పరుగెత్తుకుంటూ; అడవిలోకి పారిపోయింది. అలా దృష్టి మేరకు పారిపోయేవరకూచూసికనకరాజు తిరిగి మాట్లో కూర్చోబోతుండగా తన దృష్టిపది గజాల దూరంలో ఉన్న తుప్పమీదికి పడింది .

అక్కడ! ప్రక్కనే భూమిని అంటిపెట్టుకొని తనవైపు తీక్షణంగా క్రూరంగా చూస్తు న్నాయి రెండు ఆకుపచ్చని కళ్ళు!

మేనీటర్! కనకరాజు దృష్టి తన మీద పడిందని తెలిసీ తెలియడంతోనే భూమిని కరుచుకుని నక్కిన మేనీటర్, నొక్కి విడిచిపెట్టిన స్ప్రింగులాగ అడివి దద్దరిల్లిపోయే టట్లు ఒకే ఒక్క పెడబొబ్బపెట్టి కనకరాజు మీదికి దూకింది.

పులి గాండ్రింపూ కనకరాజు పేల్చిన తుపాకీ మోత అడవిలో మార్మోగాయి.

గాలిలోనే పులి దవడని చీల్చేసింది కనకరాజు బుల్లెట్టు, గుండు దెబ్బకి లక్ష్యం తప్పిపోయిన పులి ఆ ఊపున కనకరాజు తుపాకీని రాసుకుంటూ ప్రక్క తుప్పల్లోకి దొర్లిపోయింది. కనకరాజు తుపాకీ దూరంగా తుళ్లిపోయింది. కనకరాజుమెరుపులా పొదనిదూకి తుపాకీ కోసం పరుగెత్తాడు. తుపాకీని అందుకోబోతున్న కనకరాజు మీదికి దెబ్బతిన్న పులి లేచి గాలిలా మీద పడింది. బోర్ల పడిపోయిన కనకరాజుని పంజాతో ఇష్టంవచ్చినట్లు చిందరవందరగా రక్కేస్తోంది. కనకరాజు ఒంటిమీద చర్మం గుడ్డ పేలికల్లా ఊడిపోతోంది, తలని కొరికేద్దామని ప్రయత్నిస్తోంది కాని క్రింద దవడ గుండుదెబ్బకి జారిపోవడంవల్ల పట్టు ఆనడంలేదు. క్రిందపడిపోయిన కనకరాజు తన బలాన్నంతా కూడగట్టుకొని భూమికి చేతులు తన్ని పెట్టి ఒక్క విదిలింపు విదిలించాడు. అంత పులిన్నీ దబ్బున ప్రక్కకు పడిపోయింది. కనకరాజు మెరుపు మెరిసినట్లు చరాలున లేచి, తిరిగి తనమీద కలబడిన పులి రెండు ముందర కాళ్ళనీ పట్టుకున్నాడు. బలంతో దాని గుండెల మీద పొట్టమీద, తంతున్నాడు. ఆ పెనుగులాటలో తిరిగి కనకరాజుని వెల్లకితలా పడేసింది పులి. తన ఎడమ చేతిని పులి నోటికిఅందించి దెబ్బతిన్న నోటిలోకి మరింత గట్టిగా అణిచేస్తున్నాడు. కుడిచేత్తో దానికళ్ళుచిదిమేద్దామని ప్రయత్నిస్తున్నాడు. రెండు మూడుసార్లు దాని నాలిక దొరికితే పట్టుకొని

గట్టిగా బలం లాగెయ్యబోయాడు. అది జిగురుజిగురుగా చేతిలో నుంచి జారిపోతోంది. అలా ఒకరి మీద ఒకరు దొర్లుతూ హోరా హోరీగా పెనుగులాడుతున్నారు.

కనకరాజు ఎడం చెయ్యిని చెరుకుగడలా పిప్పిపిప్పిగా నమిలేసింది పులి. దాని అరుపులకీ దాని నోట్లోంచి వచ్చే గబ్బు కంపుకీ ఉక్కిరి బిక్కిరి అయిపోతూ ఊపిరి సలపటం లేదు కనకరాజుకి. ఆ పెనుగులాటలో అదృష్టవశాత్తూ కనకరాజుకి ఒకరాయిచేతికి దొరికింది. దాన్తో బలం పూర్తిగా పులి మొహం మీద రెండు మూడు సార్లు కొట్టాడు. ఆ దెబ్బలకి పులి దిమ్మెత్తిపోయి క్షణం సేపు కనకరాజు మీది పట్టువదిలేసింది. ఆ అదను చూసుకొని కనకరాజు తూలుకుంటూ లేచి పరుగెత్తి దగ్గర్లోవున్న ఉసిరి చెట్టు కొమ్మ పట్టుకొని మీదికి ఎగ బాకాడు – కాని విధి వక్రించింది ఎగబ్రాకుతున్న కనకరాజుని ఒక్క ఎగురు ఎగిరి తొడపట్టుకొని కిందికి లాగేసింది, బాధతో రెట్టింపుగా గాండ్రిస్తూ. తొడ మాంసం కండ చెట్టుబెరడులా వచ్చేసింది. ఆ గాయంలో నించి రక్తం పిచికారీ కొట్టినట్లు చుట్టు ప్రక్కల పొదల్ని తడిపేస్తోంది. చేవదేరిన బలమైన శరీరం గల కనకరాజు అంత రక్తం పోతున్నా తట్టుకొని పులితో అలా పెనుగులాడుతూనే ఉన్నాడు. అలా పొర్లిపొర్లి లేస్తూ పడ్తూ ఇద్దరూ ఒకఎండిపోయిన గెడ్డలో దభాలున దొర్లిపడ్డారు. ఆ గెడ్డ ఆరు ఏడుగజాల లోతుగా ఉంది. అలా పడటంలో గెడ్డ అంచునే మొలిచిన ఒక గడ్డి దుబ్బు ఆసరాగా దొరికింది. దాన్ని పట్టుకొని వేలాడ బడిపోయాడు. పులి మాత్రం దబాలున గెడ్డ అడుగున పడిపోయింది. అంత మీది నుంచి పడటం వల్లనో లేకదవడ జారిపోయిన బాధ ఎక్కువవటం వల్లనో పులి తిరిగి కనకరాజుని పట్టుకుందామనే ప్రయత్నాన్ని విరమించుకొని గెడ్డలో నించి ప్రక్క పొదల్లోకి పారిపోయింది.

దుబ్బుని పట్టుకొని వేలాడుతున్న కనకరాజు నెమ్మదిగా రొప్పుకుంటూ, ఎగబ్రాకు కుంటూ గట్టుమీదికి ఎక్కాడు. ఒళ్ళంతా గాయాలతో నిండి నెత్తురు వరదలుగా కారుతోంది. మాంసం కండలు వేలాడుతున్నాయి. ముఖంమీద చర్మంతో సహా ఎడంకన్ను ఊడిపోయి వేలబడిపోయింది. ఒంటి కన్నుతో తడుము కుంటూ తూలుకుంటూ నడుస్తున్నాడు. నీరసించిపోతున్న కనకరాజుకి అడివంతా మసగమసగ్గా కనిపిస్తోంది. అలా నడుస్తున్న కనకరాజుకి ఎదురుగా పడున్న సగం తినేసిన శవం కనిపించింది. దాన్ని దాటుకుంటూ వెళ్ళబోతున్నవాడల్లా ఆగాడు . మసగబారుతున్న దృష్టితో ఒంటికన్నుతో శవం తలని దగ్గరగాచూశాడు... మరింత దగ్గరగా చూశాడు. నెత్తురులో తడిసి మసగ బారిన కంటికి మసకమసగ్గా కనిపించింది. దాన్ని చేత్తో తడుముతూ మరింత దగ్గరగా ముఖంమీద ముఖంపెట్టి చూశాడు. మతి చలించిన వాడిలా వణికిపోతూ రెండు చేతుల్తో శవం తలని తడుముతూ, ''బాబూ! ... చిట్టిబాబూ!... నాయనా!'' అంటూ గావు కేక పెట్టాడు. ఆ శవం తల నౌకరు రాములిది కాదు. తన ఏకైక పుత్రుడు చిట్టిబాబుది... ''చిట్టిబాబూ, చిట్టితండ్రీ... నువ్వా?'' అని తల పీక్కుంటూ పిచ్చివాడిలా అరుచుకుంటూ కనకరాజు తుప్పల్నీ డొంకల్నీ తన్నుకుంటూ పడుతూ లేస్తూ అటూ ఇటూ అడవిలో పరుగెత్తు తుంటే, గొంతు కోసి విడిచిపెట్టిన గొడ్డు అరుస్తున్నట్టుంది. ఆ కొండలోయల్లో అస్తమిస్తున్న సూర్యుని కిరణాల్తో రక్త సిక్తమైన కనక రాజు మరింత ఎర్రగా కనిపిస్తున్నాడు. అడవి నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ కనకరాజు ఆర్తనాదాలు విని పిస్తున్నాయి. అలా పిచ్చిగా ఏడుస్తూ పరుగెత్తుతున్న కనకరాజు ఆఖరిసారిగా; చచ్చిపోతున్న రాక్షసుడి లా, పెద్ద చావుకేక పెట్టి కుప్పలా కూలిపోయాడు అడవి మధ్యలో.

సంజె చీకట్లు అలుముకుంటున్న సమయానికి కనకరాజుని వెతుక్కుంటూ కేశవరావు, రాములు మరికొందరు అక్కడికి వచ్చారు. తండ్రీ కొడుకుల శవాల్ని చూసిబావురుమన్నాడు రాములు.

ఇరవై సంవత్సరాలకే నూరేళ్ళు నిండిపోయాయి. తన తండ్రి పన్నిన కుట్రకి అన్నెం పున్నెం ఎరుగని చిట్టిబాబు అనుకోకుండా అన్యాయంగా బలైపోయినందుకు జలజల కన్నీరు కార్చాడు, చిట్టిబాబు శవాన్ని చూస్తూ కేశవరావు. కనకరాజు శవాన్ని చూడ్డానికి మనస్కరించలేదు కేశవరావు కి!

ఆ రాత్రి తండ్రీ కొడుకుల శవాల్ని తీసుకొని పట్నంవైపు జీపు పరుగెడుతోంది.

''బాబూ, ఆఖరి సారి నీమాట నిలబెట్టుకోలేకపోయాను నన్ను క్షమించు- నేను బయలుదేరినా బాగుండిపోను. నామాట కాదని కొట్టేసి చిట్టిబాబు బయలు దేరిపోయారు''. అంటూ కనకరాజు శవం తల ఒళ్ళో పెట్టుకొని జీపులో వెక్కివెక్కి ఏడుస్తున్నాడు రాములు.

రాములి అమాయకత్వానికి జాలిపడుతున్నాడు కేశవరావు.

కనకరాజు శవాన్ని చూస్తుంటే కేశవరావుకి జాలి కలగలేదు సరికదా, అది పులికంటే ఎన్నో రెట్లు క్రూరంగానూ, నీచంగానూ, భయంకరంగాను కనిపిస్తోంది.

జేబులోనుంచి డైరీతీసి '' దిడెత్ ఆఫ్ ఎ మేనీటర్'' అని కసిగా పెన్సిల్‌తో బరికేశాడు.

చీకట్లని చీల్చుకుంటూ జీపు పరుగెత్తుతోంది.

దూరంగా కొండల్లోపులి, బాధతో మూలుగుతూ అరుస్తుండటం స్పష్టాస్పష్టంగా వినిపిస్తోంది.

★

(ఆంధ్రజ్యోతి, వీక్లీ: 18-10-1974)

( ఈ కథ ఇంగ్లీషు అనువాదం ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ వారు సంకలనం చేసిన ''మోడర్న్ ఇండియన్ షార్ట్ స్టోరీస్'' అనే పుస్తకంలో ప్రచురితమైంది)